కాఫీ రైతుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: కాఫీ రైతుల బకాయి సొమ్ము చెల్లించాలని, నిచ్చెనలు, కత్తెర్లు అందించి రైతులు పండించిన కాఫీ గిట్టుబాటు ధర కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎంపీడీవో కిరణ్ కుమార్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎంఎం శ్రీను మాట్లాడుతూ, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఆధ్వర్యంలో గుంతలు తీసిన వేతనాల సొమ్ము లబ్దిదారుల ఖాతాలో జమ కాలేదన్నారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ లో నిధులను ప్రభుత్వం కోత విధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జర్రెల ఉపసర్పంచ్ వంతల గణపతి, గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు నారాయణ పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న నాయకులు, గిరిజనులు

ఎంపీ, ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి

- భారీ ర్యాలీలు, బైఠాయింపు - ఉధృతంగా 16వ రోజు అంగన్‌వాడీల సమ్మె

పాడేరులో ఎమ్మెల్యే ఇంటి ముందు బైఠాయించిన అంగన్‌వాడీలు

ప్రజాశక్తి -పాడేరు: తమ సమస్యలు పరిష్కారం చేయాలని అంగన్వాడీ కార్మికులు పాడేరు ఎమ్మెల్యే కొట్ట గుల్లి భాగ్యలక్ష్మి ఇంటి ముందు బుధవారం బైఠాయించారు. సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎమ్మెల్యే ఇంటి వద్ద లేక పోవడంతో ఆమె ఇంటి గోడమీద వినతిపత్రం అతికించి నిరసన తెలిపారు. ముందుగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు నుంచి ర్యాలీగా పాత బస్టాండ్, కాంప్లెక్స్ మీదుగా తలరసింగి ఎమ్మెల్యే ఇంటి వరకు అంగన్వాడీలు వెళ్లారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సుందర్రావు, అంగనవాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.భాగ్యలక్ష్మి, చిన్ని, అంబిక, ఇంద్ర పాల్గొన్నారు.

అరకులోయరూరల్: ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ క్యాంపు ఆఫీసు ముట్టడించారు. ఎమ్మెల్యే వచ్చి సమాధానం చెప్పేంతవరకు కదిలేది లేదని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. టిడిపి అరకు నియోజకవర్గ ఇన్చార్జి సీవేరి దొన్ను దొర, సిఐటియూ మండల కార్యదర్శి కె మొస్య, సిపిఎం నేతలు రామారావు, నాగులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం చర్చల పేరుతో కాలవ్యాపన చేస్తుందని ధ్వజమెత్తారు. మహిళలు రోడ్డెక్కి మండుటెండలో కన్నీళ్లు పెట్టుకొని ధర్నాలు చేస్తుంటే ప్రభుత్వం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుందన్నారు. త్వరలోనే జగన్మోహన్ రెడ్డికి తగిన బుద్ధి చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ జిల్లా జిల్లా అధ్యక్షులు డి నాగమ్మ, నిర్మల, భారతి, భవాని, లక్ష్మి, వెంకటలక్ష్మీ, సీత, అంగన్వాడి కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కూనవరంలో శబరి నదిలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ జంక్షన్ హైవే రోడ్డు వద్ద కార్మికులు ఆందోళన చేపట్టారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షురాలు కే.కొండమ్మ, అంగన్వాడిలు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో ఐసిడిఎస్ కార్యాలయం నుండి ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర గృహం వరకు భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. బైఠాయించి ఆందోళన చేపట్టారు. చైర్పర్సన్ ఇంట్లో లేదని ఆమె భర్త మూర్తి అంగన్వాడీలకు చెప్పడంతో శాంతించి అంగన్వాడీల తమ గోడును ఆయనకు వివరించారు. సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్రావు మాట్లాడుతూ, సమస్యలను పరిష్కరించకుంటే కలెక్టరేట్, ఐటీడీఏ పీవో కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్, సిపిఎం నేతలు పాంగి భీమరాజు, సోలగం గాసిరం దొర, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను, పెటియా రామదాసు పాల్గొన్నారు.

పెదబయలు: నిరసన శిభిరంలో అంగన్వాడీ కార్యకర్త కుమార్తె చిట్టితల్లి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. మెయిన్ రోడ్డుపై ఆదివాసీ దింసా నృత్యం చేస్తూ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు టి.రాజమ్మ, సుశీల, పద్మ, కొండమ్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలో సమ్మె కొనసాగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వెల్ఫేర్ యూనియన్ నాయకురాలు సిఎస్ కళావతి, పి, మంజుల, చిలకమ్మ పాల్గొన్నారు.

అడ్డతీగల : తమ సమస్యల పరిష్కారానికి 16రోజులుగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శిబిరాన్ని ఏర్పాటు చేసి సమ్మె చేస్తున్న అంగన్వాడీలు, బుధవారం యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండలంలోని ఎల్లవరం గ్రామంలోని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి ఇంటిని ముట్టడించి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇంట్లోంచి బయటకు వచ్చిన ఎమ్మెల్యే అంగన్వాడీలతో మాట్లాడి, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీనిచ్చారు. అంగన్వాడీ నాయకులు బి నిర్మల, బేబీరాణి, గంగవరం ప్రాజెక్టు నేత కె.రాణి పాల్గొన్నారు.

విఆర్ పురం : సమస్యల పరిష్కారానికి నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీలు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రేఖపల్లి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ ఎన్.శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ, నాయకులు సున్నం రంగమ్మ, అధ్యక్షులు నాగమణి, మండల కార్యదర్శి ముసురు రాజేశ్వరి పాల్గొన్నారు. అంగన్వాడీల సమ్మెకు టిడిపి నేత, మాజీ జెడ్‌పిటిసి మత్యాల రామారావు సంఘీభావం తెలిపారు.

విఆర్ పురంలో...

అడ్డతీగలలో ఎమ్మెల్యే ధనలక్ష్మిని ప్రశ్నిస్తున్న అంగన్‌వాడీలు



అరకులోయలో...

కొయ్యూరు : అంగన్వాడీల సమ్మెలో భాగంగా యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సర్బన్నపాలెంలోని ఎంపీ నివాసం ముట్టడికి అంగన్వాడీలు పెద్దఎత్తున తరలివెళ్లగా, ఇంట్లో ఎంపీ గొట్టేటి మాధవి లేకపోవడంతో వెనుతిరిగి, ఎంపీపీ బడుగు రమేష్, జెడ్‌పిటిసి వారా నూకరాజులను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై వారు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని హామీనిచ్చారు.

శబరినదిలో దిగి అంగన్వాడీల నిరసన

కూనవరం : తమ సమస్యలను పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేపడుతున్న అంగన్వాడీలు బుధవారం శబరి నదిలో దిగి నిరసన చేపట్టారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రోజుల తరబడి సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నాలుగుసార్లు చర్చలకు పిలిచి, తమ డిమాండ్స్ నెరవేర్చకుండా అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను పరోక్షంగా బెదిరిస్తోందని, వీటికి భయపడి సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. సర్పంచ్ నాగమణి, సిఐటియు నేత కొమరం పెంటయ్య, మేకల నాగేశ్వరరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, ఈశ్వర్, షణ్ముకేశ్వరరావు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఇంటి వద్ద నిరసన

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

శిక్షణ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్‌గనోరే

ప్రజాశక్తి -రంపచోడవరం : సివిల్ సర్వీసెస్, గ్రూప్ 1, గ్రూప్ 2 శిక్షణకు ఎంపికైన గిరిజన యువత దాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సూచించారు. బుధవారం స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ కార్యక్రమాలు ప్రారంభం సందర్భంగా పిఒ సూరజ్‌గనోరేతో పాటు డిఎఫ్ఒ జిజి.నరేంద్రన్, రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు. .ఈ సందర్భంగా పిఒ సూరజ్ గానోరే మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్, గ్రూప్స్ శిక్షణకు ఎంపికైన వారికి తొమ్మిదినెలలపాటు ఉచిత తరగతులు నిర్వహిస్తామన్నారు. అధ్యాపకులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని, తర్వాత తగిన ప్రాక్టీస్ చేయడం ద్వారా పరీక్షలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. శిక్షణకు సంబంధించిన మెటీరియల్‌ను తమిళనాడు నుంచి డిఎఫ్ఒ నరేంద్రన్ తెప్పించారన్నారు. శిక్షణ సమయంలో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. శిక్షణ పొందిన అభ్యర్థులంతా ఉద్యోగాలను సాధించి, ఈ ప్రాంతానికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. సివిల్ సర్వీసెస్, గ్రూప్ 1,2 శిక్షణను ట్వంటీఫస్ట్ సెంచరీ ఐఎఎస్ సొసైటీ కె.ధరణి, కోఆర్డినేటర్ బివిఎ. శ్రీకాంత్ ఆధ్వర్యంలో 9 నెలల శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పొందే గిరిజన యువతకు పాటు వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఏర్పాట్లను పిఒ పరిశీలించారు. శిక్షణార్థులపై నిరంతర పర్యవేక్షణకు ఐదుగురు ఫిజికల్ డైరెక్టర్లను ఏర్పాటు చేశామన్నారు.

డిఎఫ్ఓ జిజి. నరేంద్రన్ మాట్లాడుతూ తాను సివిల్స్ శిక్షణను ఢిల్లీలో సొంత ఖర్చులతో తీసుకున్నానని, ఏజెన్సీలోని గిరిజన యువతకు సివిల్స్, గ్రూప్స్ శిక్షణ ఉచితంగా అందుబాటులో ఆనందకరమన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్. ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ ఎంపికైన అభ్యర్థులు క్రమశిక్షణతో శిక్షణ పొందాలని, శిక్షణాకాలంలో సెల్‌ఫోన్‌ను వీలైనంత వరకు దూరంగా ఉంచాలన్నారు. నేర్చుకున్న పాఠాలు, అంశాలను రెగ్యులర్‌గా సాధన చేయాలని సూచించారు. ఎపిఒ జనరల్ సిహెచ్ . శ్రీనివాసరావు, యూత్ ట్రైనింగ్ సెంటర్ మేనేజర్ సుధీర్, గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్స్ పార్వతి, శ్రీనివాసరావు, కె. గీతాంజలి, ఎటిడబ్ల్యుఒ. రామ తులసి, ఫిజికల్ డైరెక్టర్ బాలరాజు, ఎఇఇ సత్యనారాయణ పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లించాలి

యుటిఎఫ్ ఆధ్వర్యాన ధర్నా, వినతిపత్రం అందజేత

అరకులోయలో ధర్నాచేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-చింతూరు: ప్రతినెలా ఒకటో తేదీన వేతనాల చెల్లింపు, పెండింగ్ బకాయిల సాధన ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చింతూరు ఐటిడిఎ వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో నాలుగు మండలాల ఉపాధ్యాయులు ధర్నా చేపట్టారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చేపట్టిన ఆందోళనలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.కృష్ణయ్య మాట్లాడుతూ 30నెలల పిఆర్‌సి బకాయిలు డిఎ, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సరెండర్ లీవ్స్, పిఎఫ్ రుణాలు, పిఎఫ్ పార్ట్ ఫైనల్ పేమెంట్స్, ఎపిజిఎల్ఐ.రుణాల పార్ట్ ఫైనల్ పేమెంట్స్ , సిపిఎస్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించవలసిన వాటా రూ. 2500కోట్లు బకాయి ఇతరత్రా చెల్లింపులన్నీ చేపట్టాలని కోరారు. అలాగే ప్రతినెలా ఒకటో తేదీన రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ ధర్నాకు సిఐటియు మండల కార్యదర్శి పోడియం.లక్ష్మణ్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సుజాత సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాలుగు మండలాల యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.కన్నారావు ముత్తయ్య, యం.సోమరాజు, సాగర్, కె.శ్రీనివాస్, హరినాథ్, ప్రభాకర్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, మహిళా ఉపాధ్యాయులు తులసి, లలిత, సీత, కుమారి, సత్యవతి, నాగదుర్గ, మహతి, నందిని, లక్ష్మి, మహిళా మండల కమిటీ సభ్యులు గంగాదేవి, కృష్ణవేణి దేవి పాల్గొన్నారు.

రంపచోడవరం : ప్రతినెలా సక్రమంగా వేతనాలు, పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. యుటిఎప్ జిల్లా అధ్యక్షుడు వై.విల్సన్‌బాబు మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు, పాదయాత్రలో తాను అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయులతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తానని నమ్మబలికిన సిఎం జగన్, తర్వాత మరిచారన్నారు. ఈనెల 17వతేదీ వరకు వేతనాలు ఇవ్వలేదని, ఇక బకాయిపడ్డ రూ.18వేల కోట్ల బకాయిల ఊసే లేదన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ అధ్యక్షులు కె అన్ని, జిల్లా అధ్యక్షులు కె.ఆదిరెడ్డి, కార్యదర్శి విశ్వరాజ్, రంపచోడవరం అధ్యక్షులు సనాతన బాబు, ప్రధాన కార్యదర్శి వెంగళరావు సూరిబాబు మహేష్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: ఉపాధ్యాయులకు బకాయిలు, మెరుగైన పిఆర్సి, డిఎ ఎరియర్లు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు చిట్టిబాబు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మెరుగైన పిఆర్సి అమలు చేస్తామని, సకాలంలో డిఎ అమలు చేస్తామని చెప్పి మోసపూరితమైన ధోరణిలో వ్యవహరిస్తుందన్నారు. పిఎఫ్, ఏపీజిఎల్ఐ, లోన్లు, పెన్షన్స్ సరెండర్ లీవ్ సకాలంలో చెల్లించలేదన్నారు. ఉపాధ్యాయులకు ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.దేముడు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.రఘునాథ్ ,ఉమ్మడి జిల్లా పూర్వ ఉపాధ్యక్షులు ఎస్.రాంబాబు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు యు.గంగరాజు, డుంబ్రిగూడ మండల కార్యదర్శి, బాలకృష్ణ, ఎం బాబురావు, కన్నయ్య, విజయ్ , తదితరులు పాల్గొన్నారు.

పాడేరు: బకాయిలు సకాలంలో చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.మహేశ్వరరావు డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా సహా అధ్యక్షులు సిహెచ్ నాగేశ్వరరావు ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో ముంచంగిపుట్టు, పెదబయలు, హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంపచోడవరంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత

సమగ్ర శిక్ష ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

మాట్లాడుతున్న లోకనాథం

ప్రజాశక్తి-పాడేరు: సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, దీనిపై ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే.లోకనాథం డిమాండ్ చేశారు. పాడేరు లోని ఐటిడిఏ ఎదుట సమ్మెలో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరసన దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. ఆయనతోపాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.అప్పలనరస, సీఐటీయూ అల్లూరి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోనంగి చిన్నయ్య పడాల్, ఉమామహేశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు పాలికి లక్కు దీక్షా శిబిరాన్ని సందర్శించి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వానికి లేఖ రాస్తామని ఆయన చెప్పారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ జిల్లా నాయకులు మహేష్ తదితరులు సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష శిబిరాన్ని సందర్శించి సమ్మెకు మద్దతు తెలిపారు: అనంతగిరి జడ్పిటిసి సభ్యులు దిసరి గంగరాజు, ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు మద్దతు ప్రకటించారు.

బదిలీ సిఐకి ఘన సత్కారం

ప్రజాశక్తి- కొయ్యూరు : స్థానిక సిఐగా రెండున్నరేళ్ల పాటు విశేష సేవలు అందించి గిరిజనానికి చేరువైన సిఐ ఎ.స్వామినాయుడును మరువలేమని ఎంపీపీ బడుగు రమేష్, తహసీల్దార్ తిరుమలరావు కొనియాడారు. కొయ్యూరు నుంచి రాజవొమ్మంగి సిఐగా బదిలీపై వెళ్లిన స్వామినాయుడుకు బుధవారం స్థానిక పోలీసు స్టేషన్లో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సిఐ స్వామినాయుడు దంపతులను పలువురు ఘనంగా సన్మానించారు. సిఐ స్వామి నాయుడు అమలు చేసిన ఫ్రెండ్లీ పోలీసింగ్ జిల్లాల్లో మంచి పేరు తెచ్చి పెట్టిందని తహశీల్దార్ తిరుమలరావు కొనియాడారు.కొయ్యూరు, మంప ఎస్ఐలు రాజారావు, లోకేష్ కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సిఐ సత్కార సభలో మాట్లాడుతున్న తహశీల్దార్

గ్రామాభివృద్ధికి జెన్‌కో అధికారుల మోకాలడ్డు

ఆవేదన చెందుతున్న పార్వతీనగర్ పివిటిజి గిరిజనులు

ప్రజాశక్తి -సీలేరు: తమ గ్రామంలో అభివృద్ధి పనులకు ఏపి జెన్‌కో అధికారులు అడ్డుతగులుతున్నారనిజికె వీధి మండలం సీలేరు టిఆర్ సి సమీపంలోని పార్వతినగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదుచేస్తామని అంటున్నారు. పార్వతీనగర్‌కు చెందిన పిటిజి గిరిజనుడు ప్రభాస్ మాట్లాడుతూ, పార్వతినగర్‌లో ఆదిమతెగకు చెందిన 25 కుటుంబాలు నివాసముంటున్నారు. తమ గ్రామానికి కనీస సౌకర్యాలు లేని పరిస్థితుల్లో పాడేరు ఐటిడిఎ పిఒ దృష్టికి తేగా ఆయన సానుకూలంగా స్పందించి జలజీవన్ మిషన్ కింద తాగునీరు, సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. అయితే సర్పంచ్ దుర్గో ఆధ్వర్యంలో పనులు చేపడతుండగా ఎపిజెన్‌కో అధికారులు మోకాలడ్డుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. సిసిరోడ్డు నిర్మాణానికి మట్టిపనికూడా పూర్తి చేసి, సిసి రోడ్డు పనులు చేపట్టేందుకు సిద్ధమౌతున్న తరుణంలో పార్వతీనగర్ ఏపి జెన్‌కో పరిధిలో ఉందని, ఎటువంటి అభివద్ధి పనులు చేయరాదని అధికారులు ఆంక్షలు పెట్టడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాభివృద్ధికి ఏపి జెన్‌కో అధికారులు అడ్డుతగలడంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాభివృద్ధికి సహకరించాలని వేడుకుంటున్నారు. ఏపి జెన్‌కో అధికారులు మొండిపట్టు వీడకుంటే జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ అభిషేక్ దృష్టికి తీసుకెళతామన్నారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న పార్వతీనగర్ యువకులు

డోలీ మోతతో తీసుకెళుతున్న గిరిజనులు

తప్పని డోలీ మోత

ప్రజాశక్తి-అనంతగిరి: మారుమూల గిరిజన గ్రామాలకు నిండు గర్భిణీలు, రోగులు వైద్య సేవల కోసం వెళ్లాలంటే డోలీ కష్టాలు తప్పడం లేదు. మండలంలోని పెద్దకోట పంచాయతీ మద్దిలు గ్రామానికి చెందిన కొండతామిలి రాధకు మంగళవారం అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు డోలీలో పది కిలోమీటర్ల దూరం నుండి పినకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వాలు రోడ్డు మార్గం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు

అవగాహన కల్పిస్తున్న సిఐ

వాహనదారులకు అవగాహన

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలో ఆటో యూనియన్, జీపుల యూనియన్ సభ్యులతో బుధవారం స్థానిక సిఐ రమేష్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్రైవర్ లైసెన్స్, వాహన రికార్డులన్నీ సక్రమంగా ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు. సారా, మద్యం, గంజాయి వంటివి వాటిని వాహనాల్లో తరలిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

గీతంలో అధునాతన జిమ్నాజియం ప్రారంభం

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్‌విశ్వవిద్యాలయం విద్యార్థులకు శారీరక వ్యాయామం ప్రాధాన్యతను తెలియజేస్తూ కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన అధునాతన వ్యాయామశాల (జిమ్నాజియం)ను బుధవారం బాక్సింగ్‌లో అర్జున అవార్డు గ్రహీత జయరామ్‌తో కలిసి గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ ప్రారంభించారు. విద్యార్థులకు మానసిక శ్రమతో పాటు శారీరక శ్రమ అవసరమని, తద్వారా ఒత్తిడులను దూరం చేసుకోవచ్చునని వారు పేర్కొన్నారు. అన్ని సదుపాయాలతో పాటు వ్యాయామం పూర్తి చేసుకున్న విద్యార్థులకు పోషకాహారాన్ని అందించే ప్రత్యేక విభాగాన్ని అనుబంధంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ యు.విజయకుమార్, వివిధ విభాగాల డైరెక్టర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అవంతిలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్నోవేషన్ ఇన్ మిషన్ లెర్నింగ్ పెడగాగి అంశంపై మూడు రోజుల పాటు జరుగనున్న డెవలప్‌మెంట్ ప్రోగ్రాం బుధవారం ప్రారంభమైంది. జెఎన్‌టియు విజయనగరం అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ డీప్ లెర్నింగ్‌లో న్యూరల్ నెట్‌వర్క్ తదితర అంశాలపై సమకాలీన ఉదాహరణలతో వివరించారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట

పెరిగిన బొర్రా గుహల ఆదాయం

ప్రజాశక్తి -అనంతగిరి: ఏజెన్సీలో ప్రముఖ పర్యాటక కేంద్రాలను తిలకించేందుకు గత వారం రోజుల నుండి పర్యటకులు తండోపతండాలుగా తరలి వస్తున్నారు. దీంతో అనంతగిరి ఘాట్ రోడ్ తో పాటు ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు, కటికి, చిట్టంపాడు, తాడిగుడ జలపాతాలు డముకు, సుంకరమెట్ట, యు పాయింట్లు పర్యాటకులతో సందడి నెలకొంది. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిపి వేయడంతో గంటల తరబడి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ప్రముఖ పర్యటక కేంద్రమైన బొర్రా గుహలు ఆదాయం గణనీయంగా పెరిగింది 11 రోజుల్లోనే లక్షలాది రూపాయలు ఆదాయం సమకూరింది. ఈనెల 15 రూ 2.లక్షలు89840 వేలు ఆదాయం సమకూరింది.16న రూ.4 లక్షలు, 17న రూ 6 లక్షలు43270, 18న రూ2 లక్షలు8510,19న రూ 2లక్షలు64500, 20న రూ.2 లక్షలు 43840, 21 న రూ.2 లక్షలు24760, 22న రూ 2 లక్షలు 97600, 23న రూ.5 లక్షలు66920, 25న రూ 8లక్షలు39540 ఆదాయం సమకూరినట్లు బొర్రా గుహలు మేనేజర్ గౌరీ శంకర్, టికెట్ కౌంటర్ కె. సోమేష్ వెల్లడించారు

బొర్రా గుహల వద్ద పర్యాటకులు

ధాన్యం, రాగుల సేకరణ వేగవంతం

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ధాన్యం, రాగులు సేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. వ్యవసాయాధికారులు, తహశీల్దారులు, పౌర సరఫరాల అధికారులతో బుధవారం ఆయన క్యాంపు కార్యాలయం నుండి ధాన్యం సేకరణపై జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడేరు డివిజన్ అధికారులతో రాగులు సేకరణ, రంపచోడవరం డివిజన్ అధికారులతో ధాన్యం సేకరణపై సమీక్షించారు. వ్యవసాయాధికారులు, సచివాలయం సిబ్బంది, ఉద్యానవన సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ధాన్యం, రాగులు సేకరణపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర చెల్లిస్తుందన్నారు.ధాన్యం, రాగులు సరఫరా చేసిన రైతులకు వారం రోజుల్లో నగదు సంబంధిత రైతుల ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు. చెల్లింపు వేగంగా జరిగే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని స్పష్టం చేసారు. ఈ సమావేశంలో పాడేరు ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, రంపచోడవరం ఐటిడిఏ పిఓ సూరజ్ గనోరే, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ.రమేష్ కుమార్‌రావు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, తహశీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ'లో ప్రాజెక్టు ఎక్స్‌పో

ప్రజాశక్తి-వేపగుంట : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో విద్యార్థులకు ప్రాజెక్టు ఎక్స్‌పో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రయోగాల ప్రదర్శనలను కళాశాల ఛైర్మన్ జి.సత్యనారాయణ తిలకించారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ, ఉత్తమ పద్ధతులు అవలంభిస్తూ ఒక ఆశయంతో ముందుకు సాగుతూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు.

ఎన్ఐఒతో గీతం అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి-మధురవాడ : దేశంలోని ప్రఖ్యాత సముద్ర పరిశోధన సంస్థలలో ఒకటైన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫి (ఎన్ఐఒ)తో సంయుక్త పరిశోధనలు జరపడానికి, పరస్పర సహకారానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్, శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ సమక్షంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, ఎన్ఐఒ ఇన్‌ఛార్జి శాస్త్రవేత్త ప్రొఫెసర్ వివిఎస్ఎస్.శర్మ అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. రెండు సంస్థలు మధ్య కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా సంయుక్త పరిశోధన ప్రాజెక్టులను నిర్వహించడం, విశ్వవిద్యాలయంలో పరిశోధకులకు ఎన్ఐఒ శాస్త్రవేత్తల మార్గదర్శకం వహించడం, గీతం అధ్యాపకులకు వర్క్‌షాప్‌లు, సదస్సుల నిర్వహణలో సహకరించడం, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, సమాజహిత పరిశోధనలలో సంయుక్త అధ్యయనాలు చేపట్టాలని నిర్ణయించారు. కాగా ఈ సందర్భంగా గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ మాట్లాడుతూ విశాఖలో సముద్ర సంబంధ పరిశోధనలకు గల విస్తృత అవకాశాల దృష్ట్యా ఎన్ఐఒ మరియు సిఎమ్ఎఫ్ఆర్ఐ వంటి కేంద్ర పరిశోధన సంస్థల సహకారాన్ని తీసుకోనున్నామని తెలిపారు. గీతం బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.కిరణ్మయి మాట్లాడుతూ గీతంలో దాదాపు 30 మంది అధ్యాపకులు సముద్ర అధ్యయనాలపై పరిశోధనలు జరుపుతున్నారని, 35 పరిశోధన ఫలితాలపై పేటెంట్ హక్కులకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం ఐదు భారీ పరిశోధన ప్రాజెక్టులు నిర్వహణలో ఉన్నాయన్నారు. గీతంలో ప్రారంభించనున్న బయోనెస్ట్ ప్రాజెక్టు వివరాలను ప్రొఫెసర్ ఎమ్.అనిత వివరించారు. కార్యక్రమంలో రీసెర్చి డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు, ఎన్ఐఒ శాస్త్రవేత్త డాక్టర్ దామోదర్ బెల్లే షెనాయ్, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మృతదేహం కోసం గాలిస్తున్న స్థానికులు

చాకలి గెడ్డలో యువకుడు మృతి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని సాకలి గెడ్డలో చేపలు పట్టడానికి వచ్చిన గిరిజన యువకుడు గెడ్డలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.సూకూరు పంచాయతీ బారపల్లి గ్రామానికి చెందిన నలుగురు గిరిజనులు చేపలు వేటకు బుధవారం ఉదయం చాకలి గడ్డ వద్దకువచ్చారు . బోనంగి రవికుమార్ (32) గెడ్డలో చేపలు పడుతుండగా గెడ్డ ఊబిలో కురికిపోయాడు. ఈ విషయాన్ని తోటి గిరిజనులు వంజలి శంకర్, కీల్లో రామారావు, కీల్లో సంతోష్ కుటుంబ సభ్యులకు, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. గజ ఈత గళ్ళ సహాయంతో గాలించగా మృతదేహం లభ్యమైంది. సంఘటన స్థలాన్ని అల్లూరు జిల్లా ఏఎస్పీ ధీర్ రాజ్, సీఐ సుధాకర్, స్థానిక ఎస్సై సతీష్ పరిశీలించారు.

సబ్ కలెక్టర్‌గా ధాత్రిరెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు సబ్ కలెక్టర్ గా పి.ధాత్రిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీరించారు. ముందుగా మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ధాత్రిరెడ్డి శిక్షణ అనంతరం అనకాపల్లి జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్ గా విధులు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం పాడేరు సబ్ కలెక్టర్ గా నియమించింది. ఈ మేరకు ఇన్చార్జి సబ్ కలెక్టర్, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ నుండి సబ్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. పి ఓ సబ్ కలెక్టర్ కు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేసారు. అధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసారు.

ధాత్రిరెడ్డిని అభినందిస్తున్న పిఓ

కౌమార దశ కీలకం

ప్రజాశక్త-పాడేరు టౌన్: పిల్లల్లో కౌమార దశ చాలా కీలకమైందని డైట్ లెక్చరర్స్ బి.రవి, హరిని అన్నారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు శ్రీకృష్ణ పురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో కౌమార విద్యపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కౌమార దశ 10-19 ఏళ్లలోపు ఉంటుందని తెలిపారు. ఈ దశపై అవగాహనతో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. ఈ దశలో పిల్లల్లో శారీరకంగా మానసికంగా మార్పులు చోటు చేసుకుంటారని వివరించారు. కౌమార దశలో పిల్లలకు వచ్చే శారీరక మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో డివైఇఓ చెల్లయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ అప్పలనాయుడు, ఎఎంఓ కె.భాస్కరరావు, ఎఎస్ఓ సింహాచలం, సిఎంఓ జ్ఞాన ప్రకాష్ పాల్గొన్నారు.

గెలిచిన భీమవరం జట్టు

వాలీబాల్ పోటీల్లో భీమవరం జట్టు గెలుపు

ప్రజాశక్తి - సీలేరు: జికే వీధి మండలం దామనాపల్లి పంచాయతీలో బుధవారం రెండోరోజున నిర్వహించిన వాలీబాల్ పోటీల ఫైనల్‌లో భీమవరం జట్టు విజేతగా నిలిచించి, ఉత్సాహపూరిత వాతావరణంలో సాగుతున్న వాలీబాల్ పోటీల ఫైనల్‌కు నల్లబెల్లి, బీమవరం జట్లు చేరగా, హోరాహోరీగా సాగిన ఫైనల్ పోరులో భీమవరం విజేతగా నిలవగా, నల్లబెల్లి జట్టు రన్నరప్‌గా నిలిచింది.కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ కల్యాణ్ కష్ణ, డిజిటల్ అసిస్టెంట్ శేఖర్, వెల్పర్ అసిస్టెంట్ పాత్రుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ యుగంధర్, వెటర్నరీ అసిస్టెంట్ బేరా బాలయ్య, నాగరాజు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సాహించడమే లక్ష్యం

రంపచోడవరం : మండలంలోని ముసురుమిల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు సిఎం జగన్ దీన్ని అమల్లోకి తెచ్చారని, ఆసక్తి ఉన్న ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసివంశీ కుంజం, ముసురుమిల్లి,తామరపల్లి సర్పంచ్‌లు కోసు రమేష్ బాబు, మిర్తివాడ ఆనంద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రాంబాబు, భారతి, వైసిపి నేతలు బాలురెడ్డి, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం కుమార్‌బాబు, పిఇటిలు పోతురాజు, తామరపల్లి, ముసురుమిల్లి సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు - తుంగ్లాం రోడ్డు నిర్మాణంపై సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గాజువాక, ఆటోనగర్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు గంగవరం అదానీ పోర్టు నుంచి కార్గో వాహనాల రాకపోకలు సులువగా సాగేందుకు అనువుగా సాగరమాల ప్రాజెక్టులో భాగంగా నిర్మించ తలపెట్టిన గంగవరం పోర్టు - తుంగ్లాం హైవే రోడ్డు నిర్మాణంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సమీక్షించారు. స్థానిక ప్రజలు, పరిశ్రమల నిర్వాహకుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని మార్చిన అలైన్మెంట్, కొత్త డీపీఆర్ రూపకల్పనపై సంబంధిత అధికారులతో విఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం ప్రత్యేకంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా భూసేకరణ చేపట్టి, బహుళ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు సూచించారు. గతంలో రూపొందించిన డీపీఆర్‌పై స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని డిజైన్‌లో పలు మార్పులు చేసినట్లు ఎన్‌హెచ్ఎఐ అధికారులు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. రైల్వే, ఇరిగేషన్, స్టీల్‌ప్లాంట్, ఆర్ అండ్ బి అధికారులతో సంయుక్త క్షేత్ర స్థాయి పరిశీలన చేశామని తెలిపారు. తదుపరి చేపట్టబోయే చర్యల గురించి కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం గంగవరం పోర్టు గేటు ముందు భాగం నుంచి తుంగ్లాం వరకు 10.230 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టనున్నామని చెప్పారు. అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో వ్యవహరించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని, భవిష్యత్తులో ట్రాఫిక్ రద్దీ లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున సూచించారు.

ఐఎన్ఎస్ కళింగ కమాండింగ్ ఆఫీసర్‌గా ప్రదీప్ పటేల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఐఎన్ఎస్ కళింగ కమాండింగ్ ఆఫీసర్‌గా కమాండర్ ప్రదీప్ పటేల్ బాధ్యతలు స్వీకరించారు. ఐఎన్ఎస్ కళింగలో జరిగిన కార్యక్రమంలో కమాండర్ సిఎస్ నాయర్ నుంచి ఆయన ఈ బాధ్యతలు చేపట్టారు. ప్రదీప్ పటేల్ 1 జనవరి 1996న భారత నౌకాదళంలోకి ప్రవేశించారు. ఆయన రంజిత్, ప్రళయ, తబర్ త్రికాండ్ వంటి ఫ్రంట్‌లైన్ యుద్ధ నౌకలలో తూర్పు, పశ్చిమ నౌకాదళ కమాండ్‌లు రెండింటిలోనూ పనిచేశారు.

మెట్రోతో రూపురేఖలు మారతాయి

4 కారిడార్లు.. 76.9 కిలోమీటర్లు

8 నిమిషాలకు ఒక మెట్రో రైలు

స్టీల్‌ప్లాంట్ నుంచి భోగాపురం ఎయిర్ పోర్టుకు రూ.125 ధర

'ప్రజాశక్తి'తో ఎపి మెట్రో రైల్ ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ యుజెఎం.రావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'వైజాగ్ మెట్రో రాకతో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయి. ఎక్కడా భవనాలను పడగొట్టడంగానీ, అత్యధిక మంది నిర్వాసితులు అయ్యే పరిస్థితులుగానీ వైజాగ్ మెట్రో రైలు నిర్మాణం వల్ల జరగవు. ప్రాజెక్టు ప్రతిపాదనలన్నీ సిద్ధంగా ఉన్నాయి. సెంట్రల్ హౌసింగ్ టౌన్ డవలప్‌మెంట్ ట్రాన్స్‌పోర్టు మంత్రిత్వ శాఖకు త్వరలోనే డిపిఆర్ పంపనున్నాం. 2024 మార్చిలో కేంద్రం ఆమోదించే అవకాశం ఉంది. ఈలోగా రాష్ట్ర ప్రభుత్వం జీవోను ఇవ్వాల్సి ఉంది. విశాఖ నగరం, చుట్టుపక్కల ప్రాంతాలను అనుసంధానం చేసే రైల్ ప్రాజెక్టు ఇది' అని ఎపి మెట్రో రైలు ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ యుజెఎం.రావు అన్నారు. 'ప్రజాశక్తి'తో వైజాగ్ మెట్రో రైలు గురించి ఆయన పలు విషయాలను పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

మెట్రో రైలు ప్రాజెక్టు కోసం ఏయే పనులు పూర్తయ్యాయి ? ఇది ఎలా ఉండబోతుంది ?

విశాఖలో 2020 అక్టోబర్‌లో ఎపి మెట్రో రైలు ప్రాజెక్టు కార్యాలయాన్ని ప్రారంభించిన నుంచీ వైజాగ్ మెట్రో రైల్ ప్రాజెక్టు అమలుకు కృషి చేపట్టాం. నగర జనాభా ప్రయాణం, ట్రాఫిక్ కష్టాలు, గంటల తరబడి వాహనాల కోసం ఎదురు చూడడం వంటి అంశాలను స్టడీ చేశాం. రోజుకు సుమారు 6 లక్షల మంది ఆటోలు, బస్సులు, ఇతర రవాణా సాయంతో గమ్యస్థానాలకు చేరుతున్నారు. మెట్రో రైలు వస్తే రెండు గంటల ప్రయాణ కాలాన్ని 40 నిమిషాలకు తగ్గించవచ్చు. అందుకే స్టీల్‌ప్లాంట్ మొదలుకొని కారిడార్లను ప్లాన్ చేశాం. స్టీల్‌ప్లాంట్ గేటు నుంచి కొమ్మాది జంక్షన్ వరకూ 34.40 కిలోమీటర్లు (29 స్టేషన్లు), గురుద్వారా నుంచి పాత పోస్టాఫీసుకు 5.07 కిలోమీటర్లు (6 స్టేషన్లు), తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరుకు 6.75 కిలోమీటర్లు (7 స్టేషన్లు), కొమ్మాది నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు లాంజ్ వరకూ 30.67 కిలోమీటర్లు (12 స్టేషన్లు)గా 76.90 కిలోమీటర్లు మెట్రో నడక ఉంటుంది.

మెట్రో ప్రాజెక్టుల నిర్మాణ సందర్భంలో ప్రజలు నిర్వాసితులౌతారు కదా ?

ఒక్క భవనం కూడా విశాఖలో పోదు. వన్‌టౌన్ ఏరియా పోస్టాఫీసు ప్రాంతంలో రోడ్డు విస్తరణ జరగాల్సి ఉంది. ఆర్అండ్ఆర్ కింద డిపిఆర్‌లో రూ.100 కోట్లు అవసరమని పేర్కొన్నాం. ఇంకా నగర మొత్తం మీద ఎక్కడా ఆర్అండ్ఆర్ ప్రతిపాదన లేదు.

వైజాగ్ మెట్రో రైలు ప్రాజెక్టు వ్యయం ఎంత?

వైజాగ్ మెట్రో ప్రాజెక్టు కాస్ట్ రూ.14,309 కోట్లు. ఇక్కడ కిలోమీటరుకు రూ.200 కోట్లు ఖర్చవుతుంది. మొత్తంగా 77 కిలోమీటర్ల పొడవు మెట్రో ఇది. భోగాపురం ఎయిర్ పోర్టు లాంజ్ వరకూ మెట్రో లైన్ ఏర్పాటు చేస్తున్నాం. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ నుంచి ఈ ఎయిర్ పోర్టుకు రూ.125 ఛార్జీ ఉంటుందని అంచనా వేశాం. అలాగే ఎయిర్ పోర్టు ఎక్స్‌ప్రెస్ మెట్రో సర్వీసులను ప్లాన్ చేస్తున్నాం. ఇదే మెట్రో రైలు లైన్‌పై చిన్న చిన్న స్టేషన్లు కొన్నింట్లో ఆగకుండా 'ఆపరేటింగ్ ప్లాన్' చేస్తున్నాం. ఒక సర్వీసు నుంచి మరో సర్వీసుకు మధ్య కాలం 8 నిమిషాలే ఉండేలా డిపిఆర్‌లో పేర్కొన్నాం.

ఛార్జీలు ఎలా ఉండబోతున్నాయి?

వోల్వో బస్సుతో సమానంగా కిలోమీటరుకు ఛార్జీ ఉంటుంది. అయితే దూరం ప్రయాణించే విషయంలో రేటు ప్రయాణికులకు కలిసొచ్చేలాగ ప్లాన్ చేస్తున్నాం. ఏదిఏమైనా టెలిస్కోపిక్ రేట్స్ ఫేర్ ఉంటాయి. ధరల నిర్ణయం కేంద్ర ప్రభుత్వం చేస్తోంది. మెట్రో ప్రాజెక్టు పని ప్రారంభమైతే మూడేళ్లలో ఒక లైన్ (స్టీల్‌ప్లాంట్ నుంచి ఎన్ఎడి) వరకూ ప్రజల సౌకర్యార్థం ప్రాజెక్టు పూర్తి చేస్తాం. కేంద్రం నుంచి ఆమోదం రాగానే బిడ్డింగ్‌కు వెళతాం. చెరో 20 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా కాగా, 60 శాతం పిపిపిలో సమకూర్చి మెట్రో పూర్తిచేయాలని ప్రణాళిక రూపొందించాం.

మెట్రో రైళ్లు సక్సెస్ అవుతున్నట్టేనా?

దేశంలో జీరో యాక్సిడెంట్లతో మెట్రోలన్నీ నడుస్తున్నాయి. అంత టెక్నాలజీ అభివృద్ధి జరిగింది. వైజాగ్ మెట్రోకు కన్సల్టెంట్‌గా గురుగామ్‌కు చెందిన యుఎంటిసి వ్యవహరించనుంది. ఎపి, కేంద్ర ప్రభుత్వాల మద్దతు ఉంటుంది. మెట్రో రైల్ సక్సెస్‌కి ఆఖరి గమ్యస్థానం వరకూ కనెక్టివిటీ ఉంటే చాలు. ఇంటి నుంచి ప్రయాణికులను తెచ్చి తిరిగి ఇంటికి తీసుకెళ్లేలాగ ఏర్పాట్లు చేస్తున్నాం. దీనికోసం ఎంవిపి డబుల్ రోడ్డు ప్రాంతంలో 'ఎం' అంటే మెట్రో సింబల్‌తో తూర్పు, పడమర వైపు రెండు 'ఎం' బస్సులను స్టాండ్‌బై ఉంచుతాం. మరో నాలుగు క్యాబ్‌లను సిద్ధం చేసి ఉంచుతాం. ఎంవిపి సర్కిల్‌కి చుట్టూ ఉండే ప్రయాణికులను క్యాచ్ చేయడమే లక్ష్యం.

రాష్ట్రంలో మంటగలిసిన ప్రజాస్వామ్యం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో ప్రజాస్వామిక విలువలు పూర్తిగా మంటగలిశాయని మాజీ అడిషనల్ డిజి సత్యప్రకాష్ అన్నారు. బుధవారం డాల్ఫిన్ హోటల్‌లో విశాఖ సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 40 ఏళ్లలో ఏ ప్రభుత్వం కూడా రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేయలేదన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం అందుకు భిన్నంగా ఉందన్నారు. ఓ మహిళ సోషల్ మీడియాలో పోస్టింగ్ పెడితే ఆమెపై కేసు నమోదు చేసి వేధించారని తెలిపారు. ఎపి మాజీ సిఎస్ ఎల్‌వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రజాస్వామ్యమే కొలబద్ద అన్నారు. ప్రజాస్వామ్య విలువలు వ్యాప్తి చెందేలా అందరూ పని చేయాలన్నారు. ఎగ్జిక్యూటివ్, చట్టసభలు, న్యాయస్థానాలు బలంగా పనిచేయాలన్నారు. బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అందరూ రాజ్యాంగబద్ధంగా నడవాలని ఆకాంక్షించారు. ఒక వ్యక్తి నిర్ణయాన్ని బట్టి వ్యవస్థ నడవకూడదన్నారు. రాష్ట్రంలో ఏ తరగతీ ఇప్పుడు సంతోషంగా లేదన్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకల పట్ల బాధితులు చింతిస్తున్నారని చెప్పారు. ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ మాట్లాడుతూ ఎపి ప్రభుత్వం ఎపి ల్యాండింగ్ యాక్ట్ తీసుకురావడం వల్ల పలు ఇబ్బందులు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులకే రక్షణ లేదని, న్యాయం జరగటం లేదని తెలిపారు. తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ మాట్లాడుతూ తన ఓటు హక్కును తొలగించారని చెప్పుకొచ్చారు.

మాట్లాడుతున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున

లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్ల సేవలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లు ప్రజలకు సేవలందించాలని, రుణ మంజూరు ప్రక్రియలో సులభతర విధానాలు అమలు చేయాలని బ్యాంకర్లను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ప్రజలకు అన్ని విధాలుగా సహకారం అందించాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన జిల్లా సమీక్షా సమావేశం జరిగింది. స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు, ఇళ్ల నిర్మాణాలకు రుణ మంజూరు ప్రక్రియ, సిబిల్ స్కోర్ విధానం, కిసాన్ క్రెడిట్ కార్డుల పంపిణీ, స్త్రీనిధి రుణ ప్రక్రియ తదితర అంశాలపై సమీక్షించారు. పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పాలసీ విధానాలకు అనుగుణంగా బ్యాంకర్లు వ్యవహరించాలని, ప్రజలకు సులభతర రీతిలో సేవలందించాలని పేర్కొన్నారు. ప్రధానంగా స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించుకునే వారికి, జగనన్న పేదలందరికీ ఇళ్లు, టిడ్కో పథకంలో భాగంగా నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులకు సంపూర్ణ సహకారం అందించాలని సూచించారు. టిడ్కో లబ్ధిదారులకు రుణం మంజూరు చేసే క్రమంలో సిబిల్ స్కోర్ ఉండాలనే నిబంధనలో వీలును బట్టి సడలింపు ఇవ్వాలని చెప్పారు. కిసాన్ క్రెడిట్ కార్డు ఉన్న వారికి అన్ని విధాలా సహకరిస్తూ రుణాలను మంజూరు చేయాలన్నారు. ఎంఎస్ఎంఇ సెక్టార్‌లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే వారికి సహకరించాలని చెప్పారు. అలాగే బ్యాంకర్లకు ప్రభుత్వ అధికారులు కూడా అన్ని విధాలుగా సహకారం అందించాలని సూచించారు. సమన్వయంతో వ్యవహరించి ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో భాగంగా నాబార్డు రూపొందించిన ప్రొటెన్షియల్ లింక్డు క్రెడిట్ ప్లాన్ బుక్‌ను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. సమీక్షా సమావేశంలో ఎల్‌డిఎం శ్రీనివాసరావు, ఆర్‌బిఐ ప్రతినిధి ఊర్మిళ, నాబార్డు డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ సమంత్ కుమార్, వివిధ ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకుల ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కోసం వాలంటీర్లు ర్యాలీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పని చేస్తున్న వాలంటీర్ల గౌరవ వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ బుధవారం పలువురు వాలంటీర్లు సరస్వతి పార్కు నుంచి జివిఎంసి జోన్ 4 కార్యాలయం వరకు, అనంతరం అక్కడ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. సంబంధిత అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుంచి వాలంటీర్లుగా పనిచేస్తున్న తమకు అప్పటి నుంచి ఇప్పటి వరకూ నెలకు కేవలం రూ.5 వేలు గౌరవ వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. దాదాపు నాలుగేళ్లలో అన్ని రకాల వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు, విద్యుత్ ఛార్జీలు పెరిగాయని, అదే సందర్భంలో ప్రారంభంలో తమకు చెప్పిన వాటికంటే అదనంగా పనులు చేస్తున్నామని తెలిపారు.

వాసవి క్లబ్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని సీతమ్మధార వాసవి క్లబ్ సేవలు ప్రశంసనీయమని కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని కళా హాస్పిటల్ ప్రాంగణంలో వాసవి క్లబ్ సీతమ్మధార ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను హాస్పిటల్ సిబ్బంది చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట రమణమూర్తి మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా వాసవి క్లబ్ వారు నిర్విరామంగా అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ యశస్వి, వాసవి క్లబ్ ప్రతినిధి సుగుణ కుమార్, కళా గ్రూప్స్ హెచ్‌ఆర్ పంచాది వెంకటకృష్ణ (నాని), రేణుక ఎల్లమ్మ గుడి సెక్రటరీ పోలారావ్ పాల్గొన్నారు.